## ముగిసిన ఆంత్రప్రెన్యూర్ శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ) మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్న వీహబ్‌లో మరో 31 మంది మహిళలకు ఆంత్రప్రెన్యూర్ గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దింది. ఆరు నెలల ఇంక్యుబేషన్ శిక్షణ కాలంలో టైర్ 2, టైర్ 3 నగరాలకు చెందిన మహిళలను ఎంపిక చేసుకుని శిక్షణ ఇచ్చింది. వీరికి మార్కెట్ అనుసంధానం, బిజినెస్ రిజిస్ట్రేషన్, మెంటార్‌షిప్, ఆర్థిక వనరుల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించి ఉత్పాదకత విషయంలో స్వయంప్రతిపత్తి సాధించేలా తీర్చిదిద్దింది. ఈ శిక్షణ ముగియడంతో వారికి సర్టిఫికెట్లను వీహబ్ నిర్వాహకులు అందజేశారు.

## దివ్యాంగుల కార్లు

### వారికి నచ్చినట్టుగా వాహనంలో మార్పులు

### ఆర్టీఏ అవకాశం

సిటీబ్యూరో, మార్చి 14 ( నమస్తే తెలంగాణ ) : దివ్యాంగులు, మరుగుజ్జులు అందరిలా కార్లు నడపడానికి ఆర్టీఏ అధికారులు వెసులుబాటు కల్పిస్తుంది. వారికి అనుగుణంగా కార్లకు మరమ్మతులు చేసి వారి కలను నెరవేరుస్తుంది. గత ఏడాది నుంచి ప్రస్తుతం వరకు 374 రీమోడలింగ్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొదట వాహనాన్ని కొనుగోలు చేయాలనుకున్న వ్యక్తి తనకు అనువుగా ఉన్న వెహికిల్‌ను ఎంపిక చేసుకోవాలి. కొటేషన్ తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో దానికి సంబంధించి జీఎస్‌టీ అప్లై చేయాలి. వారంలో కేంద్రం నుంచి అనుమతి పత్రం వస్తుంది. దానిని తీసుకుని షోరూంకు వెళ్లి వాహనాన్ని కొనుగోలు చేస్తారు. ఆ బండిని తీసుకుని నగరంలోని దక్కన్ మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ గ్యారేజీ సెంటర్‌కు తీసుకెళ్లాలి. ఈ సంస్థకే రాష్ట్రంలో కార్లను రీమోడల్ చేసే అనుమతి ఉంది. వాళ్లు సదరు వ్యక్తికి అనుగూణంగా క్లచ్, బ్రేకులు, సీటింగ్ విధానాల్లో మార్పులు చేస్తారు. ఆ వ్యక్తితో ట్రయల్ చేయిస్తారు. ఇంకేమైనా మార్పులు ఉంటే మాడిఫికేషన్ చేస్తారు. అందుకు సంబంధించిన వివరాలన్నీ ఆర్టీఏ రికార్డుల్లో నిక్షిప్తం చేస్తారు.

## ప్రభుత్వ భూములతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ దందా

### బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

రవీంద్ర భారతి, మార్చి 14: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ దందా చేస్తుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ఆయన వాపోయారు. ఎన్నికల ముందు బీసీ విద్యార్థులకు అది చేస్తాం ఇది చేస్తామని కల్లబొల్లి హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా వారిని చదువులకు దూరం చేస్తుందని ఆయన విమర్శించారు.





బంజారాహిల్స్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

## హోలీ వేడుకల్లో మాజీ మంత్రి తలసాని

బంజారాహిల్స్, మార్చి 14 : బంజారాహిల్స్ లో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ నివాస్ బన్సల్ నివాసంలో హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సనత్‌నగర్ ఎమ్మెల్యే , మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. హోలీ వేడుకలకు వచ్చిన వారికి శుభాకాంక్షలు తెలిపి వారికి రంగులు పుశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బద్రి విశాల్ బన్సల్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పీయూష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# నగరం రంగులమయం

హైదరాబాద్ నగరంలో శుక్రవారం హోలీ పండును ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఒకరికొకరు రంగులు చల్లుకోవడంతో నగరానికి రంగేసినట్లయింది. యువతీ యువకులు కేరింతలతో రోడ్లపైకి వచ్చి సెల్ఫీలతో ఫొటోలు దిగి సందడి చేశారు.









# టెండర్.. వండర్!

(మొదటిపేజీ తరువాయి)

టెండర్ వేశారు. మూడో బిడ్డర్ రోషన్ కంపెనీ క్వాలిఫై కాలేదు. మొదటి బిడ్డర్ నవ నిర్మాణ్ అసోసియేట్ సంస్థకు కేబీఆర్ పార్కు మొదటి గేటు వద్ద స్మార్ట్ మెకనైజ్డ్ కార్, వెహికల్ పార్కింగ్ ప్రాజెక్టు పనులు అప్పగించారు. ఈ టెండర్‌పై ఆసక్తి ఉన్న వారు చాలా మంది ఉన్న ఎవరూ పాల్గొనకుండా పలుకుబడి కలిగిన వ్యక్తులకే కట్టబెట్టారన్న విమర్శలు వినిపించాయి. అంతేకాకుండా తొలుత 10 ఏండ్ల పాటు, ఆపై ఫలితాలను బట్టి మరో ఐదేండ్ల పాటు కొనసాగేలా లబ్ధి చేకూర్చారంటూ వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

### తొలుత అభ్యంతరం..ఆ తర్వాత సై

ఈ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ ముగిసిన తర్వాత మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదానికి ప్రతిపాదనలు పెట్టారు. ఈ పార్కింగ్ విధానంపై మొదటి సారి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపాదన తీసుకురాగా సభ్యులు తిరస్కరించారు. ఈ ప్రాజెక్టుపై మరింత వివరణ కావాలని సభ్యులు ఈ సందర్భంగా కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులను కేబీఆర్ పార్కు వద్దకు తీసుకువెళ్లి పార్కింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అక్కడ సభ్యులు చాలా ప్రశ్నలు లేవనెత్తారు. ప్రైమ్ లొకేషన్‌లో 484 గజాల్లో జాగ ఇస్తున్నప్పుడు సంవత్సరానికి కేవలం రూ.28 లక్షలు చాలా తక్కువ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్మార్ట్ పార్కింగ్ ద్వారా క్యాంటీన్, ప్రకటనలకుగానూ సంవత్సరానికి రూ. కోట్లలో బిజినెస్ వస్తుందని, అలాంటప్పుడు ఇంత తక్కువ టెండర్ ఎలా ఇస్తారని అని ప్రశ్నించారు. ఇక్కడే బిగ్ బ్రదర్ ఎంట్రీతో చకచకా తదుపరి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపాదనకు ఆమోదం దక్కింది. ఈ ప్రాజెక్టుపై సీఎం కార్యాలయం నుంచి ఒత్తిడి ఉందంటూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సభ్యుల వద్ద వ్యాఖ్యానించడం గమనార్హం.



### పార్కింగ్ కోసమా? వ్యాపారం కోసమా?

కేబీఆర్ పార్కు వద్ద అసలు మల్టీలెవల్ కారు పార్కింగ్ ప్రాజెక్టు అవసరమా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొత్తగా తీసుకువచ్చిన ఈ ప్రాజెక్టు ద్వారా 72 కార్లకే పార్కింగ్ సౌకర్యం ఉంది. కానీ ఇప్పటికే అక్కడ 40 కార్లు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఉంది. అలాంటప్పుడు 32 కార్ల కోసం ఇది అవసరమా అని అటు వాకర్లు, ఇటు కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. ఇది పార్కింగ్ కోసం కాదు ప్రకటన ద్వారా ఏజెన్సీకి లబ్ధి చేకూర్చడమేనని అంటున్నారు. పార్కింగ్ సిస్టంలో గ్రౌండ్ లెవల్‌లో క్యాఫిటెరియా, కాంప్లెక్స్ చుట్టూ ఎల్ఈడీ సైన్‌బోర్డులు దర్శనమిచ్చి రూ. కోట్ల ఆదాయం ఆర్జించేలా అధికారులు ఏజెన్సీకి అగ్గువలో కట్టబెట్టారన్న విమర్శలు లేకపోలేదు. ప్రకటన రూపంలో వచ్చే ఆదాయంపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌కు కాసులు కురిపించే కామధేనువుగా పార్కింగ్ ప్రాజెక్టు మారనున్నదని చర్చ జరుగుతున్నది.

### గంటలవారీగా ధరలు

| స్మార్ట్ పార్కింగ్ | కారు | బైకు |
|---|---|---|
| 0-3 గం. వరకు | 30 | 15 |
| 03-04 గం. | 40 | 20 |
| 04-05 గం. | 50 | 25 |
| 05-06 గం. | 60 | 30 |
| 06-07 గం. | 70 | 35 |
| 07-08 గం. | 80 | 40 |
| 08-09 గం. | 90 | 45 |
| 09-10 గం. | 100 | 50 |
| 10-24 గం. | 120 | 60 |

### పార్కింగ్ చార్జీలు ఇలా

కేబీఆర్ పార్కు గేట్-1 వద్ద కడక్ చాయ్ సమీపంలో స్మార్ట్ మల్టీలెవల్ (మెకనైజ్డ్) కార్, మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయం కల్పించనున్నారు. ఈ మేరకు సదరు ఏజెన్సీ రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును దక్కించుకున్నారు.. 405 చదరపు మీటర్లలో మల్టీలెవల్ కారు పార్కింగ్ కాంప్లెక్స్‌లో 72 కార్లకు పార్కింగ్ స్థలాన్ని కలిగి ఉంటుంది. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 వరకు పనిచేయనున్నది. ఈ మల్టీలెవల్ కారు, మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయంలో సీసీటీవీ, అత్యాధునిక సౌకర్యాలతో కల్పించనున్నారు.

### అనేక సందేహాలు ?

జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ కోసం పిలిచిన టెండర్లు కేవలం 484 గజాలకు మాత్రమే. కానీ సమీపంలోనే మరో 420 గజాల ఖాళీ జాగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్కింగ్ ఏరియాను పక్కనే ఉండే జాగాను వినియోగించే అవకాశం లేకపోలేదు. ప్రాజెక్టు ఆమలులో భాగంగా పార్కింగ్ ద్వారా వచ్చే ఆదాయం కూడా చాలా తక్కువగా ఉన్నప్పటికీ గ్లో సైన్ డిస్‌ప్లే బోర్డు ద్వారా వచ్చే ఆదాయంపై జీహెచ్‌ఎంసీకి ఏ మాత్రం నియంత్రణలో ఉండదు. కానీ ఇవేవి లేకుండా 484 చదరపు గజాల జాగాను అగ్గువకే ఇవ్వడం పట్ల తీవ్ర చర్చ నడుస్తోంది. దీంతోపాటు, కాంట్రాక్టర్‌కు అదనపు వసతులు ఏర్పాటు చేసుకుని, వాటి మీద చార్జీలు వసూలు చేసుకునే వెసులుబాటు ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ ఖజానాకు వచ్చే ఆదాయానికి గండిపడనుంది. కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లే రోడ్డుపై ఉన్న స్థలం విలువ గజం ఐదు లక్షల మేర పలుకుతున్నది. కానీ తక్కువ ధరకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా అధికారుల అనాలోచిత నిర్ణయం కారణంగా అప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయగా...అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అంతేకాదు సుందరీకరణ పనుల్లో భాగంగా లక్షలాది రూపాయలు ఖర్చు వృథా అని చర్చ జరుగుతున్నది.

## నగరంలో పెరుగుతున్న వాయు కాలుష్యం

సిటీబ్యూరో, మార్చి14, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం పెరుగుతూ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శుక్రవారం నగరంలో వాయు నాణ్యత సూచికలో 106గా నమోదైంది, గాలికాలుష్యం కారణంగా వాతావరణం బలహీన స్థాయిలోకి చేరడం ఆందోళనను కలిగిస్తుంది. పీఎం 10 స్థాయి 85 కు చేరగా, పీఎం 2.5 స్థాయి 42 కు చేరింది. గ్రేటర్ పరిధిలోని జూపార్క్ ప్రాంతంలో 273కు చేరి అత్యంత ప్రమాదక స్థాయిలో నిలవడం గమనార్హం.

## వైభవంగా శ్రీ గౌర పూర్ణిమ ఉత్సవం

సిటీబ్యూరో, మార్చి 14 ( నమస్తే తెలంగాణ ) : శ్రీచైతన్యమహాప్రభు అవతరణ దినోత్సవం సందర్భంగా శ్రీగౌరపూర్ణిమ పండుగ శుక్రవారం హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఘనంగా జరిగింది. భక్తులు తయారు చేసిన 56 రకాల వంటకాలను ఛప్పన్భోగ్ నైవేద్యంగా స్వామికి సమర్పించారు. శ్రీనితాయ్గౌరాంగ అష్టోత్తర శత కలశమహా అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

# నాలా పూడ్చి.. కబ్జా చేసి..

### రూ.30 కోట్ల సర్కారు భూమికి ఎసరు



మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 14: నాగారం మున్సిపాలిటీ 291లో సర్వే నంబరులో దాదాపు 38 ఎకరాలు భూమి ఉంది. అందులో కొంత భూమి రోడ్డు, నాలా కింద పోయింది. మరికొంత పేదలు ఇండ్లు నిర్మించుకోగా 58, 59 జీవోల కింద క్రమబద్ధీకరించారు. ప్రస్తుత్తం 15 ఎకరాల వరకు ఉంది. పక్కన పట్టా భూమి కలిగి ఉన్న మల్లేశ్ యాదవ్ అనే వ్యక్తి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంపై కన్ను పడింది. ఖాళీగా ఉన్న భూమిని పట్టాభూమి పక్క నుంచి మెల్లమెల్లగా చదును చేస్తూ వచ్చాడు. కాప్రా చెరువు-ఎదులాబాద్ చెరువు నాలా సైతం పూడ్చివేశారు. నాలాను ఒక వైపు నుంచి పూడ్చివేస్తూ మరోవైపు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని తవ్వుతూ నాలానే పక్కకు జరిపి, దారి మళ్లించారు. ఇలా ఖాళీ స్థలంతో పాటు నాలాను పూడ్చిన స్థలాన్ని కలుపుకొంటే దాదాపు ఎకరంన్నర భూమిని దురాక్రమణ చేశారు. పూడ్చివేతతో దాదాపు 70 ఫీట్లు ఉన్న నాలా 20 నుంచి 25 ఫీట్లకు కుచించుకుపోయింది. నాలా పూడ్చి కబ్జా చేసిన స్థలం ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఎకరాకు బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్లు పలుకుతుంది. ఎకరన్న భూమి విలువ దాదాపు రూ.30 కోట్లు ఉంటుంది. 291 సర్వే నంబరులో భూమి ఆక్రమణ ఆరోపణలపై కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ వివరణ కోరగా సర్వే జరిపి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాలా కబ్జా విషయమై కూడా ఇరిగేషన్ అధికారులతో కలిసి సర్వే చేస్తామని తెలిపారు. సర్వేలో నాలాను పూడ్చివేసినట్టు, ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్టు గుర్తిస్తే భూమిని స్వాధీనం చేసుకొని, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



గేట్ ధర్నాలో పాల్గొన్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

## ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

### జేఏసీ ఆధ్వర్యంలో గేట్ ధర్నా

శామీర్‌పేట, మార్చి 14 : ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ సమ్మె సన్నాహక భాగంలో శుక్రవారం హకీంపేట్ బస్ డిపో వద్ద డిపో జేఏసీ ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి ఆర్టీసీ డ్రైవర్లతో నడిపించాలని, రెండు పీఆర్సీలు ఇవ్వాలని, పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. 21 డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, ఎన్ఎంయూ వల్లూరి బాబు పాల్, డిపో జేఏసీ నాయకులు బాలరాజు, గోపు శ్రీనివాస్, రామచందర్, రమేష్, సుగుణ చారి, రాజేందర్, నాగరాజు, ఎండి ఇబ్రహీం, శర్ఫొద్దీన్, పద్మ, వినోద, నాగమణి, సునీత, సుజాత, తిరుపతమ్మ, మొగులమ్మ, పాల్గొన్నారు.

# ఎన్‌సీడీ సర్వేలో ఏఎన్‌ఎంల కొరత

- స్పెషల్ డ్రైవ్ గడువులోగా పూర్తయ్యేనా..?
- బదిలీ స్థానాలు భర్తీ చేయని కాంగ్రెస్ సర్కార్
- సిబ్బంది కొరతతో ఉన్నవాళ్లపై పనిభారం

సిటీబ్యూరో, మార్చి14, (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వే ముందుకు సాగడం లేదు. సిబ్బంది కొరత వల్ల అనుకున్న గడువు లోగా పూర్తి చేస్తామా? అనే సందేహం వైద్యాధికారుల్లో నెలకొంది. కేంద్రమిచ్చిన గడువు లోగా సర్వే పారదర్శకంగా పూర్తి చేయడం కష్టంగా మారింది. సిబ్బంది కొరత తీర్చాల్సిన కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడంలేదు. జిల్లాలోని 30 ఏళ్లు నిండిన వారందరికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని



ప్రకారం ఫిబ్రవరి 20 నుంచి మార్చి 31 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా వైద్యాధికారులు ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

### అధిక పనిభారం పడుతోంది..

హైదరాబాద్ జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో పాల్గొంటున్న ఆశాలు, ఏఎన్‌ఎంలు సరిపడ లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 260 ఏఎన్‌ఎంలు, 1650 మంది ఆశాలు గతంలో ఉండగా ఇటీవల జరిగిన బదిలీల్లో 128 మంది ఏఎన్‌ఎంలు బదీలపై ఇతర జిల్లాలకు వెళ్లారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 128 ఖాళీలకు గాను కేవలం 25 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం చేసి ఉన్నవారిపై అదనపు పనిభారం మోపుతున్నారు.

### ఆరోపణలొస్తున్నాయి..

జిల్లాలోని ప్రతి ఇంటికి వెళ్లి 30 ఏళ్ల పైబడినవారికి బీపీ, షుగర్, కాన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 30ఏళ్లు పైడిన వాళ్లు 20 లక్షలకు పైగా ఉండగా, వారందరికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే నిర్వహించనున్నారు. వారందరికి బీపీ, షుగర్, కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. రోగం తీవ్రతను బట్టి స్థానిక యూపీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం తరలించాల్సి ఉంటుంది. కాని ఎన్‌సీడీ సర్వేలో అనేకమంది వివరాలు చెప్పేందుకు సంకోచిస్తున్నారు. టెస్టులు చేసిన అనంతరం సరిపడ మందులు ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తుండటం గమనార్హం.